# 4

# క్రీస్తు: ప్రవక్త, యాజకుడు, మరియు రాజు

యేసు క్రీస్తు దేవుని కుమారుడు మరియు మనుష్యకుమారుడునై యుండెను; ఆయన మానవీయమైనవాడు మరియు దైవీకమైనవాడునై యుండెను. మానవుడుగాను మరియు దేవుడుగాను, ఇహమందు ఆయన వహించాల్సి యుండిన పాత్ర ఏమైయుండినది? యేసు కనీసము మూడు పాత్రలు నెరవేర్చాడని పరిశుద్ధ సత్యవేదము బయలుపర్చుచున్నది: ఆయన "ప్రవక్త, యాజకుడు, మరియు రాజు" నై యుండెను. ఈ మూడు పాత్రల ప్రాముఖ్యమును మనము పరిశీలనగా పరిశోధించవలెనని ఆశిస్తున్నాము.

### యేసు క్రీస్తు ఒక ప్రవక్తయై యుండెను, ఒక ప్రవక్తయై యున్నాడు

ఒక గొప్ప ప్రవక్త వచ్చునని ధర్మశాస్త్రము ముందుగానే తెలియజెప్పినది, మోషే ఇలా సెలవిచ్చాడు,

> నీ దేవుడైన యెహోవా నీ మధ్యను నావంటి ప్రవక్తను నీ సహోదరులలో నీకొరకు పుట్టించును, ఆయన మాట నీవు వినవలెను యెహోవా నాతో ఇట్లనెను, "... వారి సహోదరులలో నుండి నీవంటి ప్రవక్తను వారికొరకు పుట్టించెదను, అతని నోట నా మాటలను ఉంచుదును, నేను అతనికి ఆజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పును. అతడు నా నామమున చెప్పు మాటలను విననివానిని దాని గూర్చి విచారణ చేసెదను" (ద్వితీయోపదేశ కాండము 18:15-19).

ఈ ప్రవచనం మూలమున, యేసు దినములలో జీవించుచుండిన యూదులు ఒక నిర్దిష్ట ప్రవక్త రాక కొరకు, మోషే వంటి ప్రవక్త కొరకు, ఎదురుచూచుచుండిరి. బాప్తిస్మమిచ్చు యోహాను ఎవరైనదీ కనుగొనుటకు యాజకులు మరియు లేవీయులు ప్రయత్నించుచు, "నీవు ఆ ప్రవక్తవా?" అని ఆయనను ప్రశ్నించారు (యోహాను 1:21).

యేసు కేవలము ఒక ప్రవక్త కాదు; కానీ, ఆయన మోషే వంటి ఆ ప్రవక్తయై యుండెనని అపొస్తలులు ప్రభోధించుచుండిరి. మనము అపొస్తలుల 3వ అధ్యాయంలో గమనించుచున్నట్లుగా యేసు (3:13), "పరిశుద్ధుడును నీతిమంతుడునైనవాడు" (3:14), "జీవాధిపతి" (3:15), "మీ కొరకు నియమించిన క్రీస్తు" (3:20) అని పేతురు యేసు గూర్చి బోధించుచుండెను. యేసు మోషే చేత ముందుగా తెలియజెప్పబడిన ప్రవక్తయని అతడు గుర్తించాడు (3:22, 23).

యేసు, ఆయన జీవితకాలములో, కొన్నిపర్యాయాలు ద్వితీయోపదేశకాండములో చెప్పబడిన ప్రవక్తగా గుర్తింపబడినాడు. ఆయన ఐదు రొట్టెలు రెండు చేపలతో ఐదు వేల మందికి ఆహారము పెట్టిన తరువాత ప్రజలందరు, "నిజముగా ఈ లోకమునకు రాబోవు ప్రవక్త ఈయనే" అని చెప్పుకొన్నారు (యోహాను 6:14). యేసు దేవాలయములో బోధించుచుండగా ఆయన బోధలు వినిన కొందరు, "నిజముగా ఈయన ఆ ప్రవక్తయే" అని పలికారు (యోహాను 7:40).

యేసు మోషే వంటి ఆ ప్రవక్తయై యుండెనని అంగీకరించని వారు సహితము ఆయనను ఒక ప్రవక్తగా గుర్తించారు.[1]

- యేసు కలిగియుండిన అద్భుతకరమైన తెలివిని బావి యొద్దకు వచ్చిన సమరయ స్త్రీ దగ్గర ప్రదర్శించిన తరువాత ఆమె, "అయ్యా, నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను" అని పలికినది (యోహాను 4:19).
- యేసు నాయీను విధవరాలి యౌవన కుమారుని మృతులలో నుండి లేపిన తరువాత, "మనలో గొప్ప ప్రవక్త బయలుదేరి యున్నాడు!" అని పలుకుచుండిన ప్రజలు వారి ఆశ్చర్యమును అభివ్యక్తము చేసారు (లూకా 7:16).
- యేసు పుట్టు గ్రుడ్డివానికి చూపు నొసగిన తరువాత, "... నీవతని గూర్చి ఏమనుకొనుచున్నావు?" అని ప్రశ్నించబడినప్పుడు వాడు, "ఆయన ఒక ప్రవక్త" అని ప్రత్యుత్తరమిచ్చాడు (యోహాను 9:17).
- ఆయన ఎవరైయున్నాడని ప్రజలు చెప్పుకొనుచున్నారో అని యేసు తన అపొస్తలులను అడిగినప్పుడు వారు, "కొందరు బాప్తిస్మమిచ్చు యోహాను అనియు; కొందరు ఏలీయా అనియు; కొందరు, యిర్మీయా అనియు, లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారు" అని అన్నారు (మత్తయి 16:14).
- యేసు విజయోత్సవముతో యెరూషలేము పట్టణములోనికి ప్రవేశించుచుండగా, "ఈయన ఎవరో?" అని కొందరు ప్రశ్నించినప్పుడు ఇతరులు, "ఈయన గలిలయలోని నజరేతువాడగు ప్రవక్తయైన యేసు" అని ప్రత్యుత్తరమిచ్చారు (మత్తయి 21:10, 11).
- యేసు పునరుత్థానుడైన తరువాత ఆయన, "నజరేయుడైన యేసును గూర్చి, దేవుని యెదుటను ప్రజలందరి యెదుటను క్రియలోను వాక్యములోను శక్తిగల ప్రవక్త గూర్చి" చర్చించుచుండిన తన శిష్యులలో ఇద్దరిని ఎదుర్కొన్నాడు (లూకా 24:19).

యేసు ఒక ప్రవక్తయై యుండుట గూర్చి మనకు ఏదైనా సందేహాత్మక ప్రశ్న ఉన్నట్లయితే, ఆయన తానే దానిని "ప్రవక్త తన దేశములోను తన ఇంటను తప్ప, మరి ఎక్కడైనను ఘనహీనుడు కాడు" అని చెప్పినప్పుడు, ఆయన ఒక ప్రవక్తయై యుండెనని అంగీకరించాడు (మత్తయి 13:57).

యేసును గూర్చి మనకు అందుబాటులో నున్న రుజువంతయును ఆయన నిజముగా ఒక ప్రవక్తయై యుండెనని చెప్పుటకు దోహదపడునట్లు తోడ్పడుచున్నది, కానీ యేసు ఒక ప్రవక్తయై యుండుటలో ప్రాముఖ్యత ఏమున్నది? ఆయన ఈ లోకములో జీవించియుండినప్పటి ప్రజలు ఆయన గూర్చి ఏమని అర్థంచేసికొన్నారు, ఈ నాడు మనకు ఏమని అర్థమగుచున్నది?

### యేసు దేవుని పక్షాన మాటలాడాడు

ఒక ప్రవక్తగా, యేసు క్రీస్తు దేవుని నుండి వచ్చాడు గనుక ఆయన పక్షాన మాటలాడాడు. పాత నిబంధన యందంతటను, అతడు దేవుని ప్రతినిధిగా ప్రవర్తించుట ప్రవక్త యొక్క పాత్రయై యుండినది. తత్ఫలితంగా, ప్రవక్త అందించుచుండిన సందేశము ఎల్లప్పుడును "ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా!" అను మాటలతో ప్రారంభమై కొనసాగినదై

యుండినది.[2]

"మిమ్మును గూర్చి చెప్పుటకును తీర్పు తీర్చుటకును చాల సంగతులు నాకు కలవు, గాని నన్ను పంపినవాడు సత్యవంతుడు; నేను ఆయన యొద్ద వినిన సంగతులే, లోకమునకు బోధించుచున్నాను" అని చెప్పుచూ ఆయన దేవుని పక్షాన వచ్చిన ప్రతినిధిగా మాటలాడుచున్నాడని యేసు తానే స్వాధికారంతో తెలియజెప్పాడు (యోహాను 8:26). యేసు రూపాంతరము చెందుచుండిన సందర్భంలో ఆయన, ఇదిగో "ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను; ఈయన మాట వినుడి!" అని పలుకుట ద్వారా దేవుడు యేసును తన సాధికార ప్రతినిధిగా అంగీకరించాడు (మత్తయి 17:5బి). దీనికి అదనంగా, హెబ్రీ పత్రిక రచయిత ఇలా సాక్ష్యమిచ్చుచున్నాడు, "పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితురులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని తద్వారా మనతో మాటలాడెను, ఆయన ఆ కుమారుకుని సమస్తమునకును వారసునిగా నియమించెను, ద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీయులకు 1:1, 2).

**మనము ఆయన మాట వినవలెను**

యేసు మన ప్రవక్తయై యున్నందున, ఆయన మనతో చెప్పునది మనము వినవలెను! యేసు మాటలు కేవలము మరొక వివేకవంతుడైనవాడు ఉపదేశించుచుండిన విషయమలు కావు; అవి దేవుడు సెలవిచ్చిన మాటలే అయియుండెను! ఆయన సందేశము పరలోకము నుండి పొందుకొనబడినదై యుండెను! కాబట్టి, ఆ సందేశమును ఆలకింపకుండా పెడచెవిని పెట్టుట, "ఈయన నా ప్రియకుమారుడు, ఈయన మాట వినుడి!" అని సెలవిచ్చిన ప్రభువగు యెహోవా మాటలను వినుటకు తృణీకరించుటతో సమానము (మార్కు 9:7).

## యేసు క్రీస్తు ఒక యాజకుడై యుండెను, ఒక యాజకుడై యున్నాడు

యేసు మన ప్రధాన యాజకుడని హెబ్రీ పత్రిక చాటిచెప్పుచున్నది. పదే పదే, గ్రంథకర్త ఈ వాస్తవమును నొక్కివక్కాణించాడు:

> ... మనము ఒప్పుకొనిన దానికి అపొస్తలుడును ప్రధానయాజకునైన, యేసు మీద లక్ష్యముంచుడి (3:1).
>
> ... ఆకాశమండలముగుండ వెళ్లిన, దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు (4:14).
>
> అటువలె క్రీస్తు కూడ ప్రధాన యాజకుడగుటకు తన్ను తానే మహిమపరచుకొనలేదు ... మెల్కీసెదెకు యొక్క క్రమము చొప్పున నిరంతరము యాజకుడవై యున్నావు (5:5-10).
>
> మేము వివరించుచున్న సంగతులలోని సారాంశమేదనగా: మనకు అట్టి ప్రధాన యాజకుడు ఒకడున్నాడు, పరలోకమందు మహామహుని సింహాసనమునకు కుడిపార్శ్వమున ఆసీనుడాయెను (8:1).
>
> ... అయితే క్రీస్తు రాబోవుచున్న మేలుల విషయమై ప్రధాన యాజకుడుగా వచ్చెను ... (9:11).

క్రీస్తు యొక్క యాజకత్వము అనేక రీతులలో మోషే ధర్మశాస్త్రము క్రింద నుండిన ప్రధాన యాజకులు పోషించుచుండిన పాత్ర వంటిదై యుండినది. ధర్మశాస్త్రము క్రింద నుండిన ప్రధాన యాజకుడు దేవుని చేత నియమింపబడినట్లే, క్రీస్తు కూడ నియమింపబడినాడు (హెబ్రీయులకు 5:4, 5); పాత నిబంధన క్రింద నుండిన యాజకులు "అర్పణలను బలులను" అర్పించినట్లే, క్రీస్తు కూడా అర్పించాడు (హెబ్రీయులకు 8:3).

ఏదిఏమైనా, క్రీస్తు మరియు మోషే కాలమునాటి ప్రధాన యాజకుల నడుమ నున్న తారతమ్యమును హెబ్రీ పత్రిక స్పష్టముగా తెలియజెప్పుచున్నది:

1. ఆ నాటి ప్రధాన యాజకులకు సహానుభూతి లేదు, కానీ క్రీస్తు మనకు తన సహానుభూతిని చూపించగలడు (4:15).
2. వారు లేవీ వంశీయులై యుండిరి, కానీ క్రీస్తు మెల్కీసెదెకు క్రమము చొప్పున నియమింపబడియున్నాడు (7:15).
3. వారు చట్టరీత్యా ఏర్పడిన అవసరమునుబట్టి యాజకులై యుండిరి, కానీ క్రీస్తు నాశనములేని జీవమునకున్న శక్తినిబట్టి యాజకుడయ్యాడు (7:15, 16).
4. వారు ప్రమాణము చేయకుండా యాజకులయ్యారు, కానీ యేసు ప్రమాణ పూర్వకముగా ఒక యాజకుడయ్యాడు (7:20, 21).
5. వారి యాజకత్వము తాత్కాలికమైనది, కానీ యేసు యాజకత్వము నిరంతరముగా నిలుచునదై యున్నది (7:23, 24).
6. వారు పాపిష్ఠులై యుండిరి, కానీ యేసు పాపరహితుడు (7:27).
7. వారు జంతువులను బల్యర్పణలు గావించారు, కానీ క్రీస్తు తన స్వరక్తమునే అర్పణగా ధారపోసాడు (9:12).
8. వారి పరిచర్య రాబోవుచుండిన మేలుల ఛాయయై యుండినది (10:1); క్రీస్తు, కలిగియున్న మేలుల విషయమై వచ్చిన ప్రధాన యాజకుడై యున్నాడు (9:11).
9. వారు బలులను అనుదినము అర్పించారు, కానీ క్రీస్తు ఒక్కసారియే అర్పించాడు (10:11, 12).

హెబ్రీ పత్రికకు వెలుపల, క్రొత్త నిబంధనలోని ఇతర గ్రంథములు క్రీస్తు యొక్క యాజకత్వ కార్యకలాపములను ఇతర మాటల్లో తెలియజెప్పుచున్నవి. పౌలు, "దేవుడొక్కడే, దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే, ఆయన క్రీస్తుయేసను నరుడు" అని వ్రాసాడు (1 తిమోతి 2:5). "ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసు క్రీస్తు అను ఉత్తరవాది తండ్రి యొద్ద మనకున్నాడు" అని యోహాను చెప్పుచున్నాడు (1 యోహాను 2:1).

**యేసు మానవుని పక్షాన దేవుని యెదుట నిలువబడియున్న ప్రతినిధియై యున్నాడు**

మానవుని పక్షాన దేవుని సమీపించుట యాజకుల పాత్రయై యుండినది. దేవుని మాటలను ఆయన ప్రజలకు చాటిచెప్పుట ద్వారా ప్రవక్త దేవుని పక్షాన మానవుల యొద్దకు వచ్చిన ప్రతినిధియై యుండెను, అలాగే యాజకుడు దేవుని యెదుట మానవుల పక్షాన విజ్ఞాపనలు చేయుచుండెను. పాత నిబంధన క్రింద, దేవుని ఉగ్రతను శాంతింపజేయు నిమిత్తము బలులు

అర్పించుట ద్వారా యాజకుడు ఈ పరిచర్య చేసాడు. యేసు క్రీస్తు కూడా అదే పని చేసాడు, అయితే ఆయన దేవుని న్యాయము కోరుచుండిన దానిని తృప్తిపర్చుటకు మానవుని పాపముల నిమిత్తము తనను తానే బల్యర్పణగా అర్పించుకొన్నాడు. ఈ బల్యర్పణకు తోడుగా, యేసు మన పక్షాన దేవుని సింహాసనము యెదుట విజ్ఞాపనము చేయుచునే యున్నాడు. "ఈయన తనద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు, గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు" అని హెబ్రీయులకు 7:25 సెలవిచ్చుచున్నది.

నేటి క్రైస్తవుల విషయంలో, క్రీస్తు "దేవుని సంబంధమైన కార్యములలో కనికరమును నమ్మకమునుగల మన ప్రధానయాజకుడైయున్నాడు" అను వాస్తవము (హెబ్రీయులకు 2:17) మనకు శుభవార్తయై యున్నది. ఆయన మనకు సహానుభూతి చూపించు ప్రధాన యాజకుడై యున్నాడనునది దీనిని మించిన ఉత్తమమైన శుభవార్తయై యున్నది. సత్యవేదములో మనము ఈ క్రింది విధముగా చదువుదుము,

> తాను శోధింపబడి శ్రమపొందెను, గనుక శోధింపబడువారికిని సహాయము చేయగలవాడైయున్నాడు (హెబ్రీయులకు 2:18).

> మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయనులలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపములేనివాడుగా ఉండెను (హెబ్రీయులకు 4:15).

మన ప్రధాన యాజకుడు, మన పక్షాన దేవుని యెదుట విజ్ఞాపనము చేయుచున్నవాడు, శ్రమనొందుట, శోధింపబడుట, మరియు మానవుడై యుండట అనగా ఏమిటో ఎరుగును గనుక మనము సంతోషముతో సంబరపడవచ్చును!

**ఆయన మనకు ధైర్యమును కలుగజేయును**

యేసు మనకు సహానుభూతిగల ప్రధాన యాజకుడై యున్నందున, మనము దేవునిని ధైర్యముతో సమీపించవచ్చును. హెబ్రీయులకు 4:16 ఇలా చెప్పుచున్నది:

> గనుక [క్రీస్తు మన ప్రధాన యాజకుడై యున్నాడు గనుక] మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదుము.

క్రీస్తు దేవునికి ప్రవక్తగా దేవుని మాటలను మనకు తెలియజెప్పుట మాత్రమే కాదు, గాని ఆయన మన పక్షాన దేవుని యొద్ద విజ్ఞాపనము చేయుచుండును. గనుక దేవుడు – క్రీస్తు చేయుచున్న విజ్ఞాపనమునుబట్టి – మన ప్రార్థనలు ఆలకిస్తూ మన సమస్త అక్కరలను తీర్చునని విశ్వసించుచూ, మనము ఎడతెరపిలేకుండా దేవుని సింహాసనమును ధైర్యముతో సమీపించుట ద్వారా ఈ విజ్ఞాపనమును మనకు సానుకూలంగా సద్వినియోగము చేసికొందుము.

## యేసు ఒక రాజై యున్నాడు, ఒక రాజైయుంటాడు

దైవీకమైన ఒక రాజు వచ్చునని ప్రవక్తలు ఏనాడో ప్రవచించారు. ఆయన తన సింహాసనముపై దావీదు వంశస్థుని ఆసీనునిగా చేయుననియు అతని సింహాసనము నిరంతరము

నిలుచునదై యుండుననియు దేవుడు వాగ్దానం చేసాడు (2 సమూయేలు 7:12-16). ఈ వాగ్దానమును ప్రవక్తలు మరి ఎక్కువ వివరంగా ప్రకటించారు. “ఆలకించుడి, రాజు నీతినిబట్టి రాజ్యపరిపాలన చేయును” అని యెషయా చెప్పుచున్నాడు (యెషయా 32:1). యెషయా ఈ క్రింది విధంగా కూడ ప్రవచించాడు,

> ఏలయనగా మనకు శిశువు
> పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింపబడెను;
> ఆయన భుజముమీద రాజ్యభారముండును
> ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు,
> నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును.
> ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమమును కలుగునట్లు,
> సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును.
> న్యాయమువలనను నీతివలను రాజ్యమును స్థిరపరుచుటకు
> అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును.
> సైన్యములకధిపతియగు యెహోవా ఆసక్తి కలిగి దీనిని నెరవేర్చును ... (యెషయా 9:6, 7).

## యేసు ప్రవచింపబడిన రాజై యున్నాడు

దావీదు సింహాసనముపై ఆసీనుడగు రాజుకు సంబంధించిన ప్రవచనంను యేసు నెరవేర్చాడని క్రొత్త నిబంధన స్పష్టము చేయుచున్నది. ఆమె జన్మనివ్వనై యుండిన శిశువు గూర్చి గబ్రియేలు దూత మరియకు బయలుపర్చాడు:

> ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనముము ఆయనకిచ్చును; ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును, ఆయన రాజ్యము అంతములేనిదై యుండును (లూకా 1:32, 33).

వాస్తవమునకు, యేసు – ఆయన జీవించియున్నప్పుడు, ఆయన మరణములో, మరియు ఆయన ఆరోహణుడైన తరువాత ఒక రాజుగా గుర్తింపబడినవాడై యుండెను. మత్తయి 2:2 ప్రకారం, యేసును వెదకుచూ తూర్పు దేశము నుండి వచ్చిన జ్ఞానులు, “యూదులు రాజుగా పుట్టినవాడెక్కడ నున్నాడు?” అని అడిగారు. యేసు చివరిసారి యెరూషలేము పట్టణము లోనికి ప్రవేశించుచుండగా, “జయము, ప్రభువు పేరట వచ్చుచున్న, ఇశ్రాయేలు రాజు స్తుతింపబడునుగాక అని కేకలు వేసిరి” అని యోహాను 12:13 సెలవిచ్చుచున్నది. “నీవు రాజువా?” అని పిలాతు యేసును అడిగినప్పుడు ఆయన, “నీవన్నట్టు నేను రాజునే, సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే యీ లోకమునకువచ్చితిని” అని సమాధానమిచ్చాడని యోహాను 18:37, 38లో చదువుదుము. **“ఇతడు యూదుల రాజైన యేసు”** అని వ్రాయబడి యుండిన పిలాతు యొక్క గుర్తును సైనికులు సిలువకు పైన ఉంచారు (మత్తయి 27:37).

కొలొస్సయులకు 1:13 ప్రకారము, క్రైస్తవులు “... తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా చేయబడియున్నారు.” క్రీస్తును, దేవుని గొఱ్ఱెపిల్లను, “ప్రభువులకు ప్రభువును రాజులకు రాజు” అని యోహాను, ప్రకటన గ్రంథంలో వర్ణించుచున్నాడు (ప్రకటన 17:14).

**మనము ఆయనకు లోబడవలెను**

మనకు రాజైయున్నవాడుగా, యేసు మనలను ఆజ్ఞాపించుటకు హక్కు కలిగియున్నాడు. ఆయనకు సర్వాధికారమున్నది (మత్తయి 28:18) గనుక మనము ఆయన ఆజ్ఞలకు లోబడవలెనని ఆయన కోరుచున్నాడు (మత్తయి 7:21). లోబడుటకు మనము నిరాకరించినట్లయితే, మనకు శిక్ష విధింపబడును. క్రీస్తు "తన ప్రభావమును కనుపరుచు దూతలతో కూడా పరలోకమునుండి అగ్నిజ్వాలలో ప్రత్యక్షమై, *దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికిని* ప్రతిదండన చేయుటకు" తిరిగి వచ్చునని పౌలు వ్రాసాడు (2 థెస్సలొనీకయులకు 1:6-8).

రాజుకు విధేయతతో లోబడు పాలితులు ఆయన కాపుదలను అనుభవించుదురు. క్రైస్తవులు రాజ్యనివాసులుగా చేయబడిన రాజ్యము నిశ్చలమైనది (హెబ్రీయులకు 12:28, 29). మనము జయింపశక్యము కాని రాజు చేత పరిపాలింపబడుచున్నాము! మనము మన తలలు పైకెత్తుకొందాము, ఏలయనగా మనము విశాల విశ్వమంతటికిని సర్వాధిపతియైయున్న వానిని, "రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నావానిని" వెంబడించుచున్న వారమై యున్నాము (1 తిమోతి 6:15). మనము ఒక ప్రక్క ఈ సత్సంబంధములలో సంతోషించుచునే, రాజు యెదుట నమ్రతతో వంగి నమస్కరించుటకును ప్రతి విషయములో ఆయన చిత్తప్రకారము చేయుటకు వెదకుటకును, తద్వారా ఆయన ఉగ్రతకు గురికాకూడదని మర్చిపోకూడదు.

## ముగింపు

యేసు వహించు పాత్ర ముప్విధములైనది: ఆయన ప్రవక్త, యాజకుడు, మరియు రాజునై యున్నాడు. ప్రవచింపబడిన ప్రవక్తగా, ఆయన దేవుని పక్షమున మనతో మాటలాడాడు. మనము ఆయన మాట ఆలకింపవలెను! మన యాజకుడుగా, ఆయన మన పక్షమున దేవునితో విజ్ఞాపనము చేయుచుండును. మనము ఆయన ద్వారా దేవుని యొద్దకు ధైర్యముతో వెళ్లవచ్చును. రాజుగా, ఆయన తన రాజ్యమును, చివరకు విజయము సాధించి నిరంతరము నిశ్చలముగా నిలుచు రాజ్యమును తన ఆజ్ఞల మేరకు రాజ్యాధిపతిగా పరిపాలించును. మనము మన రాజును గౌరవించుచు ఆయనకు లోబడియుండవలెను.

యేసు క్రీస్తును నీవెలా దృష్టించుచున్నావు? ఆయన వహించు పాత్రలలో ఆయనను ప్రవక్తగాను, యాజకుడుగాను, మరియు రాజుగాను చూచుటకు నీవు విఫలుడవైనట్లయితే, ఆయన నీకు చేయు మేలులను నీవు సంపూర్ణంగా అర్థంచేసికొనక సంతోషంతో అనుభవించలేవు. ఇంకా ఎక్కువ ముఖ్యమైన విషయమేమనగా, నీవు ఆయన యెడల ఎలా సరియైన రీతిలో ప్రతిస్పందించాలో నీవు గ్రహించలేవు. ఆయన మన మంచి కొరకు దేవుడు పంపిన ప్రవక్త యని ఎంచి ఆయన తెలియజెప్పు విషయములను ఆలకించెదవా? ఆయన నీకు ప్రధాన యాజకుడై యుండుట వలన కలుగు మేలులను ఆహ్లాదంగా ఆలింగనము చేసికొనగలవా? ఆయన రాజ్యములో ఉండుటనుబట్టి అందజేయబడు ఆశీర్వాదములను అనుభవించెదవా? నీవు ఆ రాజ్యములో, "విమోచనము, అనగా పాపక్షమాపణ" సమకూర్చు ఆ రాజ్యములో రాజ్యనివాసివై యుంచగల సదవకాశమును ఆయన నీకు అనుగ్రహించుచున్నాడు (కొలొస్సయులకు 1:13, 14).

క్రీస్తు రాజ్యములో రాజ్యనివాసులమై యుండుటలో గల సంతోషమేమిటో అదెలా ఉంటుందో ఎరుగుటకు, ఆయన బోధలను అంగీంకరించుచు ఆయన ఆజ్ఞలకు లోబడుచుండుము, నీవు యేసునందు విశ్వసించి (యోహాను 8:24 చూడుము) ఆయన దేవుని కుమారుడైయున్నాడని నీకు ఆయనయందు గల విశ్వాసమును ఒప్పుకొని (మత్తయి 10:32), నీ పాపముల గూర్చి పశ్చాత్తాపపడి (లూకా 13:3), నీ పాపముల క్షమాపణార్ధమైన బాప్తిస్మము పొందుకొనవలెనని నీకు ఆజ్ఞాపింపబడి యున్నది (మార్కు 16:16).

---

సూచనలు

[1]ప్రజలు యేసును ఒక ప్రవక్తగా ఎందుకు గుర్తించారు? ఆయన దేవుని మాటలను అధికారముతో ప్రకటించాడు. పాత నిబంధనలోని కొందరు ప్రవక్తల వలెనే ఆయన కూడా అద్భుతములను చేసాడు, మరియు పాత నిబంధన ప్రవక్తలలో కొందరు ప్రదర్శించిన ఆశ్చర్యకరమైన తెలివిని ఆయన కూడా ప్రదర్శించాడు (మత్తయి 9:4; యోహాను 4:19; లూకా 7:39 చూడుము).

[2]యెషయా 1:2ఎ; ఆమోసు 1:3ఎ; మీకా 1:1ఎ; జెఫన్యా 1:1; హగ్గయి 1:2; జెకర్యా 1:1; మలాకీ 1:1 చూడుము.